# అందరికీ అన్న

"ఒరే, అన్నయ్యా....!" పిల్చింది సునంద.

పరశురామ్ పలకలేదు.

"ఒరే, పర్శూ అన్నయ్యా....!" అని మళ్ళీ పిల్చింది సునంద.

పరశురామ్‌కి మండిపోయింది. తన ఆలోచనల నుండి బయటపడుతూ, "ఛంపేస్తాను, మళ్ళా 'అన్నయ్యా' అని పిల్చావంటే" అని విరుచుకు పడ్డాడు.

అప్పుడే అటుగా వచ్చిన సుభద్రమ్మ, కొడుకుతో, "మరి అన్నయ్యా అని కాక అది నిన్నెలా పిలవాల్రా?" అంది.

తేరుకుంటూ, "సారీ, అమ్మా, సారీ, నేనెక్కడో ఉండి పోయాను" అని చెల్లెలి వంక తిరిగి, "ఏంటే, అంత కొంపలుమునిగే పనేమిటి, ఇల్లెగిరి పోయేట్టు అరుస్తున్నావు!" అన్నాడు పరశురామ్.

"ఫో, నేన్చెప్పనే చెప్పను" అని కోపంగా తల్లితో పాటు వంటింట్లోకి వెళ్ళిపోయింది. తన స్నేహితురాలు జలదాంగనవస్తున్నానని ఫోను చేసిందనీ, ఆమె కేవో సందేహాలున్నా యట- అవి తీర్చుకోటానికి వస్తున్నదనీ చెబుదామనుకున్న సునంద ఆమాట చెప్పలేదు. అన్న విసుక్కోటంతో ఆమెకు కోపం వచ్చింది.మామూలుగా అయితే పరశురామ్‌కి చెల్లెలంటే ఎంతో గారాబం. ఆమె అడిగింది కాదనడు, అడిగింది తెచ్చి పెడతాడు, తెలియక పోతే చెప్తాడు. ఆమెకీమధ్యే పెళ్ళయింది. ఇంకా కాపురానికి పంపలేదు. నాలుగు రోజుల్లో ఇల్లు విడచి వెళ్ళే చెల్లెలంటే మరీ ముద్దు. అయితే ఈమధ్య అతని మనసు బాగుండటం లేదు. మరీ 'అన్నయ్యా' అన్న మాట వినపడితే చాలు అతనికి ఒళ్ళు మండిపోతోంది. దానికి పెద్ద నేపథ్యమే ఉంది.

పరశురామ్ ఎప్పుడోకాని నల్గొండ రాడు. హైదరాబాదులో, ఉస్మానియా యూనివర్శిటీలోని పిజి హాస్టల్‌లో నాలుగేళ్ళబట్టీ ఉంటున్నాడు. అతను మొదటి నుండి బ్రిలియంట్ స్టూడెంట్. స్కూలు చదువుల్లోనూ, ఇంటర్మీడియెట్‌లో కూడా క్లాసులో ఫస్టున వచ్చేవాడు. విద్యార్థుల్లో అతనికెంతో ఫాలోయింగుండేది. అమ్మాయిలు, అబ్బాయిలు కూడా అతనంటే పడి చచ్చేవాళ్ళు. తెలియని పాఠాలు అతన్ని అడిగి చెప్పించుకునే వాళ్ళు. 'ఒరే, బ్రదర్!' అని అబ్బాయిలూ, 'అన్నా!' అని అమ్మాయిలూ అని అతని చుట్టూ తిరుగుతూంటే అతను ఎంతో మురిసిపోయేవాడు.

ఇంటర్మీడియెట్ చదివేటప్పుడు అతని మిత్రుడు, సుధీర్, "ఒరే, నిన్ను వినోద ప్రేమిస్తోంది రా!" అంటే, "ఛత్, ప్రేమలూ, దోమలూ మన ఒంటికి పడవు. మళ్ళా ఆ కూత కూశావంటే నీ ప్రాణం తీస్తాను" అంటూ పవిత్రంగా బతికాడు, అందరికీ సోదర ప్రేమను పంపిణీ చేస్తూ.

"అమ్మాయిలు 'అన్నా' అంటే నీకెలా ఉంటుందోకానీ, నాకయితే మహా చెడ్డ చిరాకేస్తుంది" అన్నాడు సుధీర్.

"అదేం...? అందులో తప్పేం ఉందీ?" అని అమాయకంగా అడిగాడు పరశు రామ్.

"అందులో రెండు మతలబులున్నయ్యి. ఒకటి– నిన్ను 'అన్నా' అని పిల్చి నీ నుండి ప్రమాద పరిహారం చేసుకుంటున్నారు– దే ఆర్ డిజార్మింగ్ యు. రెండు– ఆ పిల్ల నీ కంటే వయసులో పెద్ద దయినా, నిన్ను అన్నను చేసి తన వయసును దాచేసుకుంటుంది. అది ఆడవాళ్ళు చేసే కుట్ర! మన క్లాసులో ఉన్న ఇంత మంది అమ్మాయిల్లో ఒక్కత్తైయినా ఎవరినయినా 'తమ్ముడూ' అని పిలవటం నువ్వు విన్నావా?"

"ఒరే, వద్దురా, ఇప్పటి నుండి ఆడపిల్లల గురించి ఆలోచించి బాగుపడిన వాడెవడూ లేడని చరిత్ర చెబుతోంది. ఆడపిల్లలు అక్కలయినా, చెల్లెళ్ళయినా మనకొకటే. అందుకు ఇంత రాద్ధాంతం అవసరం లేదు" అని అప్పుడన్నాడు కానీ ఆ తర్వాత పునరాలోచించు కోవాల్సి వస్తుందని అతనెప్పుడూ అనుకోలేదు.

బి ఏ మగపిల్లల కాలేజీలో చదివాడు కనుక తోటి విద్యార్థులు 'బ్రదర్!' అన్నా, 'అన్న!' అన్నా, 'తమ్ముడు!' అన్నా పెద్దప్రమాదం లేకుండా నెట్టుకొచ్చాడు. పిజి లో చేరాకే అతనికి ఇబ్బందులు తలెత్తటం మొదలయింది. ఇంగ్లీషు ఎంఏ లో చేరిన కొన్నాళ్ళకే అతనికి మంచి విద్యార్థి అన్న పేరు వచ్చింది. ఫస్టు సెమెస్టర్‌లో సెమినార్ జరిగినప్పుడు 'హ్యూమర్ ఇన్ జాఫ్రీ ఛాసర్' అన్న అంశపై చక్కటి పత్రాన్ని చదివాడు. ప్రొఫెసరూ

మెచ్చుకున్నాడు. రెండు ప్రశ్నలు కూడా వేశాడు- కాశీమజిలీ కథలకీ, 'కాంటర్ బరీ టేల్స్'కీ పోలిక ఏమిటి? నీకు స్పెన్సర్ 'ఫెయిరీ క్వీన్' నచ్చిందా, ఛాసర్ 'టేల్సా'? మొదటి ప్రశ్నకు అతను సమాధానం చెప్పలేక పోయాడు, రెండోదానికి సమాధానం నల్లేరు మీద బండిలా నడిచింది. తోటి విద్యార్థుల మధ్య అతని పలుకుబడి పెరిగి పోయింది. ఆ తర్వాత మరో అంశమూ అతన్ని అందరికీ సన్నిహితం చేసింది. ఎక్సకర్షన్స్ ప్లాన్ చెయ్యటంలో అతను ఎక్స్‌పర్ట్. అటు చదువులోగానీ, మరో సాయం పొందటానికిగానీ విద్యార్థులెవరూ సంకోచించేవాళ్ళు కాదు. ఇంక ఆడపిల్లల సంగతి చెప్పనే అక్కర్లేదు. అతని నోట్సు అడిగి తీసుకునేవాళ్ళు. తెలియని విషయాలు అడిగి తెల్సుకునేవాళ్ళు.'అన్నా! కీట్స్ నెగెటివ్ కాపబిలిటీ గురించి చెప్పు' అని ఒక పిల్ల అడిగితే, 'ఈజ్ మిల్టన్ ఏన్ అడ్వొకేట్ ఆఫ్ శాటన్?' అని అడిగేది మరో పిల్ల. అలా అతని ఎంఏ ఇంగ్లీషు కాలం అద్భుతంగా గడచిపోయింది.'ఆ తర్వాత వాళ్ళు సుఖంగా జీవితం గడుపుకున్నారు' అని కథ ముగించటానికి వీలులేదు. ఇది జీవితమయి పోయింది.

రెండో సంవత్సరం చివరి సెమెస్టర్‌లో నార్త్ ఇండియా టూరు కెళ్ళినప్పుడు అతనికి తన క్లాసుమేటు సాహితితో ఎంతో సాన్నిహిత్య మేర్పడింది. సారనాథ్‌లో తిరిగేటప్పుడు బుద్ధుడు, ఆయన జీవితం, 'ధర్మ చక్ర పరివర్తనం' గురించీ వివరించి చెప్పాడు పరశురామ్. ఆమె చాల శ్రద్ధగా వింది అతని మాటలు. ఇది వరకులా విషయ పరిజ్ఞాన వెలార్చేటట్లుగా లేవు అతని మాటలు. అతనిమాటల్లో ఏదో కొత్త లౌల్యం చోటు చేసుకుంది.

"మీకు బౌద్ధ మతం గురించి ఎంత బాగ తెల్సు, బ్రదర్!" అని ఆమె అతన్ని మెచ్చుకుంది కూడా.

పరశురామ్ మదిలో నందనాలు పూశాయి.

"మా డాడీ ఎప్పటినుండో బౌద్ధమతంలోకి మారాలనుకుంటున్నారు" అని కూడా చెప్పింది సాహితి.

"ఆ మతం జనసామాన్యంనుండి వెళ్ళిపోయి చాల కాలమయింది. ఇప్పుడు దాన్లో చేరటం మరేదో ఆశించే కానీ, బుద్ధుడి పట్ల నమ్మకంతో కాదు" అన్నాడు పరశురామ్.

"అదేం, అంబేద్కర్ మారలా?"

"ఆయన ఆదర్శవాది. హిందూ సమాజంలోని కుల వ్యవస్థ, అసమానతల కారణంగా ఆయన మరో సమాజంలోకి వెళ్ళాలనుకున్నాడు. క్రైస్తవం, ఇస్లాం మరీ విదేశీమతాలు కనుక ఇండియాలోనే పుట్టి పెరిగిన బౌద్ధాన్ని ఆయన స్వీకరించాడు. ఆ మత సిద్ధాంతాల పట్ల కూడా ఆయన ఆకర్షితుడయాడు. ఆ మేరకు ఆయన సంప్రదాయవాది అనే చెప్పాలి.

ఇప్పుడు ఎస్సి లలో చాల మంది క్రైస్తవమతం పుచ్చుకుంటున్నారు."

"మేం ఎస్సిలమే. కాని క్రైస్తవులం."

"మరి మీ నాన్న ధర్మారెడ్డి కదా?"

"నిజమే. మా నాన్న రెడ్డి, మా అమ్మ ఎస్సి. పిల్లల్ని కనే అమ్మే ముఖ్యం కదా?"

అతను జవాబివ్వ లేదు. తల్లి ముఖ్యమో, తండ్రి ముఖ్యమో అతనికీ తెలియదు. సాహితి ఎస్సి కులస్థురాలని తెలిశాక అతని మనసులో కొంత శైత్యం నెలకొంది. వర్ణాంతరాల్ని అధిగమించటం అంత తేలిక కాదు. అయితే ఆమె ఆకర్షణను తట్టుకుని నిలబడటం కష్టం. కులాల అంతరాలని పట్టించుకోకుండా ఎదిగే ప్రయత్నం చేశాడు, కొంత సఫలత పొందాడు. ఆమె పిలిస్తే వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. సాహితి తండ్రి అతన్ని సాదరంగా ఆహ్వానించినా, ఆమె తల్లి ముఖం మాత్రం ముడుచుకుంది.

అతను ఇంటికి వెళ్ళిన మొదటి రోజే, "ఏమిటో ఈ స్నేహాలు, ఎటు దారితీస్తాయో?" అంది, విరసంగా, ఎవర్నో సంబోధించినట్టు. ఆమె భయాలు ఆమెవి. కూతుర్ని మేనల్లుడికిచ్చి పెళ్ళి చెయ్యాలనుకుంది ఆమె. మధ్యలో స్నేహితుడనంటూ పిల్లను తన్నుకువెళ్తే ఎలా అన్నది ఆమె బాధ. సాహితి తండ్రి ధర్మారెడ్డి ఐఏఎస్ ఆఫీసర్. ఆధునిక భావాలు కలవాడు, పాశ్చాత్య సంస్కృతి పట్ల ఎంతో మోజున్నవాడు. అందుకే కూతురు ఆంగ్లసాహిత్యం చదవాలని ప్రోత్సహించాడు. ఆయన ప్రోత్సాహంతోనే పరశురామ్ సివిల్స్‌కు ప్రిపేరవాలని అనుకున్నాడు. మొదట ఇంగ్లీషు ఎం ఏ. చేశాక సివిల్స్‌కు ప్రిపేరవుతూ, హాస్టల్‌లో ఉండాలంటే యూనివర్సిటీ విద్యార్థికే వెసులుబాటు కనుక చరిత్రలో ఎం ఏ చెయ్యటం మొదలెట్టాడు. సాహితి సెకండ్ క్లాసులో పాసయింది. తన లాగా డిస్టింక్షన్‌లో రానందుకు పరశురామ్ విచారించినా, సాహతి మాత్రం ఎంతో సంతోషించింది.

"పోన్లే, ఏదో క్లాసు! ఏం చదివినా పెళ్ళి తప్పదుకదా?" అంది.

"అప్పుడే ఏం పెళ్ళి! చదువు" అన్నాడు పరశురామ్.

"నేను చేసుకుంటాను" అంది తలవంచుకుని సిగ్గుపడుతున్నట్టు.

"కానీ, నా కిప్పుడే చేసుకోవాలని లేదు."

"నిన్నిప్పుడు ఎవరు చేసుకోమన్నారు?"

"మరి...మరి! నన్ను చేసుకోవా?"

"సారీ, బ్రదర్! కలసి తిరిగాం, స్నేహితుల్లా మెలిగాం. నాకెప్పుడూ ఆ భావనే

లేదు. పైగా, నేను పుట్టినప్పుడే మా బావతో నా పెళ్ళి నిశ్చయమయింది. అతను స్టేట్స్‌లో ఉన్నాడు. పెద్ద డాక్టరు" అంది సాహితి.

అలా మొదలయింది పరశురామ్ మనసులో– ఎవరన్నా 'బ్రదర్' లేక 'అన్నా' అన్నా ద్వేషం. ఈ విషయంలో సాహితిని తప్పు పట్టలానికి వీలు లేదు. ఆమె ఎప్పటి నుండో అతన్ని 'బ్రదర్' అని పిలుస్తూనేవుంది. అది పరశురామ్‌కు సమానార్థకమని అతను భావించేవాడు. వినీ, వినీ అతని కా మాట అర్థం కోల్పోయింది. ఆ మాట కో అర్థం ఉందనీ, సాహితి అర్థం అదే ననీ అతనెప్పుడూ ఊహించలేదు. ఇలా భావించటంలో అతనిదీ తప్పులేదు.

ఒకసారి సుధీర్ తండ్రికి ఏక్సిడెంటు అయితే. ఆయన్ని చూడటానికి సుధీర్‌తో కల్సి ఆసుపత్రికి వెళ్ళాడు పరశురామ్. అదే ఆసుపత్రిలో సుధీర్ తల్లి నర్స్‌గా పని చేస్తోంది. తనకు సేవ చేస్తున్న నర్స్ భార్యను ఆయన 'సిస్టర్' అని పిలవటం చూసి ఎబ్బెట్టుగా ఫీలయాడు కానీ, 'మరి ఆసుపత్రిలో సిస్టరే కదా' అని ఆ తర్వాత సమాధాన పడ్డాడు. తన్ను సహవిద్యార్థులు 'బ్రదర్' లేక 'అన్నా' అన్నా, వారి మాటల అర్థం అది కాదనుకునేవాడు అతను.

పరశురామ్ ఎంఏ చరిత్ర రెండో సంవత్సరంలో ఉండగా సాహితి పెళ్ళయింది. ఆమె భర్తతో అమెరికా వెళ్ళిపోయింది. సివిల్స్ రాయటానికి కొంత మనసు లగ్నం చెయ్యక తప్పలేదు అతనికి. అందుకే అతను పరిచయాలను తగ్గించుకునే ప్రయత్నం చేశాడు కానీ తోటి విద్యార్థులు అతని స్కాలర్‌షిప్ పట్ల ఆకర్షితులవటం మాత్రం తగ్గలేదు. అతను ఎంఏ ఇంగ్లీషు చదువు పూర్తి చేసినా, అతని జూనియర్లూ, వారి జూనియర్లూ అతని దగ్గర కొచ్చి సందేహాలు తీర్చుకునేవారు. అలా అంగనతో కూడ అతనికి పరిచయమయింది. పరశురామ్ ఎంఏ చరిత్ర చివరి సెమెస్టర్‌లో ఉండగా, ఆమె ఎంఏఇంగ్లీషు చివరి సెమెస్టర్ చేసేది. మిగతా అమ్మాయిలూ, అబ్బాయిలూ అతని చుట్టూ చేరి సమాధానాలు రాబట్టుకుంటున్నా, ఆమె ఒక్క ప్రశ్న వేసేది కాదు. రెప్పవాల్చకుండా అతన్ని చూస్తూ కూర్చునేది. చామనచాయతో, సన్నగా ఉన్నా, ఆమె ముఖం కళకళలాడుతుండేది. మనుషుల మనస్తత్వాలను లోతులకెళ్ళి పరిశీలించే తత్త్వం ఆమెది. అప్పుడు సాహితి తన్ను వదలి వెళ్ళిన నిర్విణ్ణతలో ఉన్న అతను ఆమెను గురించి అసలు పట్టించుకోలేదు.

అలాంటి పరిస్థితి ఆభిజాత్యమున్న ఏ అమ్మాయికయినా అవమానకరమే. అందుకే మిత్రులతో కూడిన ఒక సమావేశంలో అంగన "మూడు ప్రశ్నలు వేస్తాను, జవాబు చెప్పండి" అంది.

"కమాన్ షూట్" అన్నాడు పరశురామ్.

"తెలుగు...తెలుగు... అలా ప్రతి దానికీ ఇంగ్లీషు కూతలొద్దు"

పరశురామ్ నోటి తడి ఆరిపోయింది, "ఏమిటో చెప్పండి" అన్నాడు.

"ఒకటి- 'యుబి' అనగా నేమి?" అని ఆమె ప్రశ్నించగానే అందరూ నవ్వారు.

అతనేదో చెప్పబోయాడు."వద్దు... ఇప్పుడే చెప్పే ప్రయత్నం చేయవద్దు. రెండు- బెర్నార్డ్ షా 'లైఫ్ ఫోర్స్' సిద్ధాంతం ఎంత వరకు పని చేస్తుంది? మూడు- అసలు మనం ఇంగ్లీషు సాహిత్యం ఎందుకు చదవాలి?"

అతనికి మొదటి ప్రశ్న అర్థం కాలేదు. రెండోది సుమారుగా చెప్పగలడు. మూడోది అర్థంలేని ప్రశ్నగా కన్పించింది అతనికి. అతను నోరు తెరవబోతే, "ఇప్పుడే వద్దని చెప్పానా? బాగా ఆలోచించి రేపు చెప్పండి" అంది ఆమె.

రాత్రంతా మథించినా మొదటి ప్రశ్నకు జవాబు తట్టలేదు పరశురామ్‌కు. అతని మనస్సు 'అంగనా మంగనా మంతరేమాధవం, మాధవం మాధవం చాంతరేణాంగనా' అయిపోయింది. మర్నాడు క్లాసులకు వెళ్ళలేదు అతను. ఇలా జరగటం మొదటి సారి అతని జీవితంలో. సాయంత్రం 'యుబి...యుబి...' అని బుర్ర బద్దలు కొట్టుకుంటున్న సమయంలో, కృష్ణమూర్తి వచ్చాడు, "అరే, కోటీకి వెళ్ళాలి, రారా" అంటూ.

"నేను రాను. నువ్వు వెళ్ళు" అన్నాడు పరశురామ్.

"అదేం, అలావున్నావు?"

"ఏం లేదు. సరే, 'యుబి' అంటే ఏమిటి?"

ఆ మాట వింటూనే పడీపడీ నవ్వాడు కృష్ణమూర్తి.

"ఏమయిందిరా అలా నవ్వేదుస్తున్నావు?" అని అడిగాడు పరశురామ్. అతనికి అంగన ప్రశ్న వేసినప్పుడు అమ్మాయిలు నవ్విన సంగతి గుర్తుకు వచ్చింది. అనుమానంగా అతని వంక చూశాడు.

కాసేపటికి నవ్వాపుకుని, "నీకు తెలియదా, తెలిసే ఎంజాయ్ చేస్తున్నావనుకున్నానే?! అమ్మాయిలు అది చెప్పుకుని వాళ్ళల్లో వాళ్ళు నవ్వుకోటం నువ్వెప్పుడూ చూడలా?"

అప్పుడు పరశురామ్‌కి లీలగా గుర్తుకు వచ్చింది. అజ్ఞాతంగా అవమానభార మేదో అతన్ని కుంగదీసింది.

అడగాలని లేక పోయినా అడక్క తప్పలేదు, "ఏమిటో చెప్పు, నాన్చక"అని.

"ఇప్పుడు కాదులే, తర్వాత..." అని చెప్పకుండా, పిలుస్తున్నా విన్పించుకోకుండా వెళ్ళి పోయాడు. ఆ తర్వాత ఎందరో మిత్రుల్ని 'యుబి' అంటే ఏమిటో చెప్పమని అడిగాడు, అర్థించాడు. ఒక్కడంటే ఒక్కడు జవాబివ్వలేదు. "మాకు తెలియదు" అన్నారు. వాళ్ళకు తెల్సని నిర్ధారణే పరశురామ్‌కు. వీళ్ళంతా కల్సి తన మీద కుట్ర చేస్తున్నారన్న భావం కలిగింది. తనున్న స్థానం నుండి కింద పడినట్టయింది అతనికి. అంటే ఇప్పటిదాకా అమ్మాయిలూ, అబ్బాయిలూ తన వల్ల లాభం పొందుతూనే తన్ను ఆట పట్టిస్తున్నారు. రెండు రోజులు అతను కాలేజీకి వెళ్ళలేక పోయాడు. అంగన పట్ల విపరీతమయిన కోపం వచ్చింది.

ఆరోజు ఆర్ట్స్ కాలేజీ మెట్లెక్కుతూంటే కన్పించిన అంగన, "బావున్నారా?" అని అడిగి, మీరు నేనడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పాల్సిన పని లేదు లెండి. చరిత్ర చదువుతున్నారుగా, దీనికి జవాబు చెప్పండి. అసలు ఇంగ్లీషువాళ్ళు మన దేశాన్ని ఎందుకు వదిలేసి వెళ్ళారంటారు?" అని చెప్పి, సమాధానం వినకుండా మెట్లు దిగి వెళ్ళిపోయింది ఆమె.

ఆమెలోని గడుసుదనమదే. ప్రశ్న వేసింది. సమాధానమక్కర్లేదట! పోనీ తనే సమాధానం చెప్పి తన్నీ సంకటం నుండి తరింప చేయ వచ్చుగా? ఆమెతో మాట్లాడటం కష్టమయి పోయింది అతనికి. తన్ను అడిగే ప్రశ్నలు తన సందేహాలు తీర్చుకోటానికి కాదు. తన మానసాన్ని ఇబ్బంది పెట్టటానికి అని అర్థమయింది అతనికి. మొదట్లో ఆమె అంటే అతని కెంతో కోపమొచ్చింది. అయితే దాని స్థానే మెల్లగా గౌరవం కూడా పెరిగింది. తన కళ్ళు తెరిపించింది ఆమె. గుడ్డిగా లోకాన్ని నమ్మొద్దని అన్యాపదేశంగా చెప్పింది. లేకపోతే తను మరెంత అవమానాలకు గురయ్యేవాడో! అతనింక ప్రశ్నలకి జవాబు చెప్పటం మానేశాడు. అంతకు ముందు ఆమెనసలు గుర్తించని అతని మనసు ఇప్పుడు ఆమె అంటే ఉలిక్కి పడుతోంది- ఎప్పుడు ఏ ప్రశ్న సంధిస్తుందోనని.

అలాంటి సమయంలో పరీక్షలయాయి. ఆ తర్వాత ఆమెను మళ్ళా అతను చూడలేక పోయాడు. ఆమె ఆచూకీ కూడా ఎవరూ చెప్పలేక పోయారు. నాలుగు రోజులు ఆమె ఎక్కడయినా ఎదురు పడుతుందేమోనని ఎదురు చూసిన పరశురామ్ నిరాశతో నల్గొండ వెళ్ళక తప్ప లేదు.

ఇంటికొచ్చిన పరశురామ్‌కి పొద్దే పోయేది కాదు. ఏదయినా పుస్తకం చదువుదామన్నా చదవ బుద్ధేసేది కాదు. చిరాగ్గా ఉండేది. ఆ చిరాకులోనే అతను సునంద 'అన్నయ్యా' అని పిల్చినా, సాహితి చేసిన ద్రోహం గుర్తుకు వచ్చి, ఎవరో తన్ను గేలి చెయ్యటానికి

అలా పిలుస్తున్నారని విసుక్కున్నాడు.అప్పుడు ఇంట్లోకి ప్రవేసించింది అంగన. ఆమె సునంద క్లాసుమేటు. చెల్లెలి కోసం ఆమె తమ ఇంటికి వచ్చినా ఆమెనతను ఎప్పుడూ గమనించలేదు. అక్కడ ఉస్మానియాలో చదివేటప్పుడూ, మిగతా అమ్మాయిలతో ఆమెని కలుసుకున్నా అతను ఆమెను గుర్తించ లేదు. అప్పుడే ఆమె అతన్ని సాధించ నిశ్చయించుకుంది. అందులో భాగమే ప్రశ్నలు. అమాంతం మాయమైపోవటం కూడా పథకంలో భాగమే. ఆమెకు తెల్సు అతనెక్కడికీ పోలేడని. అతని ఇల్లూ, కుటుంబం అన్నీ తెల్సు ఆమెకు.

ఆమెను చూస్తూనే, "మీరేమిటి ఇలా, ఈ ఊళ్ళో!" అని ఆశ్చర్య పడి పోయాడు పరశురామ్.

"మాది ఈ ఊరే. నేను సునంద క్లాసుమేటును" అంది అంగన నవ్వుతూ.

"అట్లాగా? నేను గమనించనే లేదు" అన్నాడతను నొచ్చుకుంటూ.

అయితే అతనికి ఆమెను మళ్ళా కలుసుకున్నందుకు మహదానందంగా ఉంది.

"మీరు గమనించనివి చాలానే ఉన్నాయి!"

"ఉదాహరణకు..."

"పెద్ద ఉదాహరణలెందుకు లెండి. నా చిన్నప్పటి నుండి నేను మీ ఇంటికి వస్తూనే ఉన్నాను. ఇప్పటికిగానీ నేను నేనని మీరు గమనించ లేదు..."

"చెప్పొచ్చుగా? అందుకు నన్నింత చికాకు పెట్టాలా? మిమ్మల్ని కలవలేక పోయినందుకు ఎంత బాధ పడ్డానో"

"ఎందుకో...?"

"ఐ లైక్ యు వెరీ మచ్. ఐ లవ్ యు" అన్నాడు పరశురామ్, పరవశమై పోతూ.

సిగ్గుల మెగ్గవటం అంగన వంతయింది.

అంతలో సునంద హాల్లోకి ప్రవేశించింది. సునంద అంగనను పరిచయం చేస్తూ, "ఇందాక ఇది వస్తుందని చెప్తేనే విసుక్కున్నావు. దానికేదో ఇంగ్లీషు పాఠం అర్థం కాలేదట! చెప్పు" అంది.

"చెప్పేశారులే, పద" అని ఇంట్లోకి దారి తీసింది అంగన.

పరశురామ్ సివిల్స్‌లో విజయుడయ్యాడు. ట్రైనింగూ అయింది. ఇంక పోస్టింగ్సే రావాలి. పరశురామ్, అంగనల పెళ్ళయింది. ఆ తర్వాత వాళ్ళు ఎంతో కాలం

సుఖసంతోషాలతో జీవితంవెళ్ళబుచ్చారని చెప్పపని లేదు. అయితే, మొదటి రాత్రి భార్యను కలవటానికి పోతూ పరశురామ్ కృష్ణమూర్తిని గడ్డం పట్టుకు బతిమి లాడాడు,

"యుబి అంటే ఏమిటో చెప్పరా" అని.

"దానికి నన్నింత అర్థించాలా? నీ భార్య నడిగితే చెప్తుందిగా?" అన్నాడు కృష్ణమూర్తి.

"బాబ్బాబు, చెప్పరా, ఆమె నడిగి లోకువ కాదల్చుకోలేదు" అన్నాడు పరశురామ్.

"నీకు యూనివర్సిటీలో 'యూనివర్సల్ బ్రదర్' అంటే 'యుబి' అని నిక్ నేమ్ ఉండేది. అంటే అందరికీ పర్మనెంట్ బ్రదర్. ప్రేమికుడయ్యే అవకాశమే లేదు. ఓ విధంగా..." అని చెప్పబోయి నవ్వేశాడు కృష్ణమూర్తి.

"నోర్ముయ్! చంపేస్తాను, వెధవా!" అని మిత్రుడిని తిట్టాడు కానీ అదిరి పాటు కలిగింది అతనికి.

కృష్ణమూర్తి చెప్పాడు, "భయపడకు. మీ ఆవిడకు మాత్రం కాదులే. ఆమె నిన్నెప్పుడూ 'బ్రదర్' అని పిలవగా నేను వినలేదు. ఒకవేళ ఎవరయినా పిల్చినా హాస్పిటల్‌లో మా నాన్న మా అమ్మని 'సిస్టర్' అని పిలవటం లాంటిదే. ఆ మాటకు అర్థం లేదు"అని.

అయితే, "మా అన్నయ్యలో ఏంచూసి పెళ్ళిచేసుకున్నావే?" అని సునంద అంగనను అడిగితే ఆమె చెప్పిన గడుసు సమాధానం వేరు. అది మాత్రం మీరు వినితీరవల్సిందే.

"యూనివర్సిటీలో అమ్మాయిలందరూ మీ అన్నయ్యని సోదరుడుగా భావించే వాళ్ళు. తెలివిగలవాడే కానీ అమ్మాయిల్ని లోబరుచుకోవాలన్న యావ లేని వాడు. అలాంటి వ్యక్తి మొగుడయితే ఆడదానికెంత సుఖం. మెగుణ్ణి కాచుకుని ఉండాల్సిన పనేఉండదు" అని చెప్పి "అందరికీ అన్న నా అందగాడు... నాకెంతొ మిన్న నా సరిజోడు" అని రాగం తీసింది జలదాంగన.

అయితే ఆమె చెప్పని కారణం కూడా ఉంది: ఓ ఐఏయస్ భార్యకు జీవితంలో మరింత భద్రత ఉంది.

స్వప్న, మాసపత్రిక (జులై 2010)